www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
నిపుణ I పోటీపరీక్షల ప్రత్యేకం
మంగళవారం 20 జూన్ 2023
పాలిటీ
నిపుణ
నమస్తే తెలంగాణ
Telangana Today

# పరిపాలనపై నియంత్రణ.. ప్రభుత్వానికి ప్రాతినిధ్యం

## పట్టణ స్థానిక సంస్థలు, నిర్మాణం

- 1992లో 74వ రాజ్యాంగ సవరణ తర్వాత పట్టణాల్లో కూడా మూడంచెల స్థానిక ప్రభుత్వ వ్యవస్థను ఏర్పాటు చేశారు.
  1. మొదటి అంచె- నగర పంచాయతీ
  2. రెండో అంచె- పురపాలక సంస్థలు
  3. మూడో అంచె- నగరపాలక సంస్థలు

**నగర పంచాయతీలు**

- గ్రామీణ వ్యవస్థ నుంచి పట్టణీకరణ దిశగా మారుతున్న సుమారు 20,000 నుంచి 40,000 వరకు జనాభాగల చిన్న పట్టణ ప్రాంతాలకు నగర పంచాయతీ హోదాను కల్పిస్తారు.
- నగర పంచాయతీని జనాభా మేరకు వార్డులుగా విభజిస్తారు. ప్రతి వార్డు నుంచి ఒక సభ్యుడు ఓటర్లచేత నేరుగా ఎన్నుకోబడతాడు.
- నగర పంచాయతీలో గరిష్ఠంగా 10 మంది ఎన్నుకోబడిన వార్డు సభ్యులు, ముగ్గురు నామినేటెడ్ సభ్యులు ఉంటారు.
- నగర పంచాయతీలో నివాసమున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హోదా రీత్యా సభ్యులుగా ఉంటారు.
- నగర పంచాయతీ సభ్యులు తమలో ఒకరిని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. ఉపసర్పంచ్ వలె వీరిని అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించవచ్చు.

**పురపాలక సంస్థలు**

- 1965లో సమగ్ర పురపాలక సంస్థల చట్టం ప్రకారం మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. 74వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా ఏపీ ప్రభుత్వం 1994లో కొత్త చట్టాన్ని రూపొందించింది.

గమనిక: తెలంగాణ ప్రభుత్వం నూతన మున్సిపల్ చట్టాన్ని 2019లో ప్రత్యేకంగా రూపొందించింది. పట్టణ స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థికి ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉండొద్దనే పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం 2021లో రద్దు చేసింది.

- 40,000 నుంచి 3,00,000 జనాభా ఉన్న పట్టణాల్లో పురపాలక సంస్థలు ఏర్పాటు చేస్తారు. పురపాలక సంస్థల వార్షిక ఆదాయం, పరిమాణం ఆధారంగా వీటిని ఐదు రకాలుగా వర్గీకరించారు.

1. సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంఘం – వార్షిక ఆదాయం ఎనిమిది కోట్ల రూపాయలపైబడి ఉన్నవి.
2. స్పెషల్ గ్రేడ్ పురపాలక సంఘం- వార్షిక ఆదాయం ఆరు నుంచి ఎనిమిది కోట్ల రూపాయల మధ్య ఉన్నవి.
3. గ్రేడ్-1 పురపాలక సంఘం- వార్షిక ఆదాయం నాలుగు నుంచి ఆరు కోట్ల రూపాయల మధ్య ఉన్నవి.
4. గ్రేడ్-2 పురపాలక సంఘం- వార్షిక ఆదాయం రెండు నుంచి నాలుగు కోట్ల మధ్య ఉన్నవి.
5. గ్రేడ్-3 పురపాలక సంఘం- వార్షిక ఆదాయం ఒకటి నుంచి రెండు కోట్ల రూపాయల లోపు ఉన్నవి.

సూచన: పై వర్గీకరణను ప్రభుత్వం కాలానుగుణంగా మార్చవచ్చు. ప్రస్తుతం తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు మార్పులు ప్రతిపాదించాయి.

**నిర్మాణం**

- గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతంగా పరివర్తన చెందుతున్న ప్రాంతాన్ని నగర పంచాయతీగా గుర్తిస్తారు.
- చిన్న పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తారు.
- పెద్ద పట్టణాల్లో మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తారు.
- ఒక ప్రాంతం పరివర్తన చెందుతున్న ప్రాంతం అని, చిన్న పట్టణం, పెద్ద పట్టణం గురించి రాష్ట్ర గవర్నర్ సరైన అర్థ వివరణ ఇస్తారు.
- ప్రతి పురపాలక సంస్థలో నాలుగు అంగాలు ఉంటాయి.



## పురపాలక మండలి

- పురపాలక సంస్థ చర్చా వేదికే పురపాలక మండలి. దీనిలో ఎన్నికైన సభ్యులు, కోఆప్టెడ్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉంటారు.

**మున్సిపల్ కౌన్సిలర్లు**

- ఎన్నికయ్యే సభ్యులను రిజిస్టర్డు ఓటర్లు వార్డు ప్రాతిపదికన ఎన్నుకుంటారు. వీరిని కౌన్సిలర్లు అంటారు. జనాభాను బట్టి వీరి సంఖ్య నిర్ణయిస్తారు.
- 40 వేల వరకు జనాభా ఉంటే 21 మంది కౌన్సిలర్లు
- 40 వేల నుంచి లక్ష వరకు ఉంటే 21 మంది సభ్యులు, ప్రతి 10 వేల జనాభాకు ఒక సభ్యుడు అదనంగా ఉంటాడు.
- లక్ష నుంచి రెండు లక్షల వరకు ఉంటే 27 మంది సభ్యులు, ప్రతి 15 వేల అదనపు జనాభాకు ఒక సభ్యుడు ఉంటాడు.
- రెండు లక్షల పైబడి ఉంటే 33 మంది సభ్యులు, ప్రతి 20 వేల అదనపు జనాభాకు ఒక అదనపు సభ్యుడు ఉండవచ్చు. అయితే గరిష్ఠంగా 45 మంది సభ్యులకు మించొద్దు.

**కో ఆప్టెడ్ సభ్యులు**

- పట్టణ స్థానిక సంస్థల్లో విశిష్ట అనుభవం ఉన్న వ్యక్తులను, అలాగే మైనారిటీ వర్గానికి చెందిన సభ్యులను కో ఆప్టెడ్ సభ్యులుగా నియమిస్తారు.

**హోదారీత్యా సభ్యులు**

- ఎక్స్ అఫీషియో సభ్యులుగా జిల్లా కలెక్టరు, మున్సిపల్ కమిషనర్, పురపాలక సంస్థ పరిధిలోని లోక్‌సభ, విధానసభ సభ్యులు తమ అధికార హోదాలో భాగంగా సభ్యులుగా కొనసాగుతారు.
- మండలి సాధారణంగా నెలకొకసారి సమావేశమవుతుంది.
- మండలి సమావేశ ఎజెండాను మున్సిపల్ చైర్మన్‌తో సంప్రదించి మున్సిపల్ కమిషనర్ రూపొందిస్తారు.
- పురపాలక మండలిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు రిజర్వేషన్లు ఉంటాయి.

## మున్సిపల్ చైర్మన్

- మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన పద్ధతిలో ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణ, ఏపీలో పరోక్షంగా ఎన్నిక అవుతున్నారు.
- వీరు పార్టీ ప్రాతిపదికపైన ఎన్నికవుతారు.
- పురపాలక సంస్థ ప్రథమ పౌరుడు
- ఇతను మండలిలోని కొన్ని స్థాయీ సంఘాలకు అధ్యక్షత వహిస్తారు.
- వైస్ చైర్మన్ కూడా పరోక్షంగా ఎన్నికవుతారు.

## మున్సిపల్ కమిషనర్

- పురపాలక సంస్థ పరిపాలనాధిపతే మున్సిపల్ కమిషనర్.
- పురపాలక మండలికి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య సంధానకర్తగా వ్యవహరిస్తారు.
- సమావేశాల ఎజెండాను చైర్మన్‌తో సంప్రదించి రూపొందిస్తాడు.
- మండలి సమావేశాలకు ఎక్స్ అఫీషియో సభ్యుని హోదాలో పాల్గొంటాడు.
- మండలి తీర్మానాలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన తర్వాత అమలు చేస్తాడు.
- మండలి తీర్మానాలను మూడు రోజుల వ్యవధిలో జిల్లా కలెక్టర్‌కు, పురపాలక పాలన ప్రాంతీయ డైరెక్టర్‌కు పంపిస్తాడు.
- వార్షిక బడ్జెట్‌ను రూపొందిస్తాడు.
- సంస్థకు సంబంధించిన పన్నులను వసూలు చేసి, రికార్డులను నిర్వహిస్తాడు.
- సంస్థకు సంబంధించిన సిబ్బంది, ఆస్తులు, కార్యకలాపాలపై నియంత్రణ చేస్తాడు.

**స్థాయీ సంఘాలు**

- ప్రతి పురపాలక సంస్థలో కొన్ని స్థాయీ సంఘాలుంటాయి. అవి..
  1. విత్తం, 2. పనులు, 3. ఆరోగ్యం, 4. విద్య, 5. మహిళా సంక్షేమం, 6. వెనుకబడిన వర్గాల సంక్షేమం

**పురపాలక సంస్థ విధులు**

- పురపాలక సంస్థ విధులు రెండు రకాలు

1. ఆవశ్యక విధులు

- జనన, మరణ రిజిస్టర్లను నిర్వహించటం
- ప్రాథమిక, మాధ్యమిక, సెకండరీ పాఠశాలలను నిర్వహించడం
- పౌరులకు పరిశుభ్రమైన నీరు, వీధి దీపాలను ఏర్పాటు చేయడం
- ప్రజారోగ్యం, పరిశుభ్రతలను నిర్వహించడం
- రహదారులు, భవనాలను నిర్వహించడం
- సంస్థ ఆస్తులను సంరక్షించడం

2. వివేచనాత్మక విధులు

- అనారోగ్య, అపరిశుభ్ర ప్రదేశాలను బాగుచేసి నిర్వహించడం
- పార్కులు, మ్యూజియంలు, విశ్రాంతి గృహాలు, లైబ్రరీలను నిర్వహించడం
- మాతా, శిశు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం
- ప్రసూతి కేంద్రాలను నిర్వహించడం

**ఆదాయ మార్గాలు**

- పన్నులు, ఫీజులు, డ్యూటీలు
- మార్కెట్లు, భవనాల నిర్వహణ ద్వారా సమకూరే ఆదాయం
- బహిరంగ రుణాలు, ప్రజలు అందించే విరాళాలు

## నగర పాలక సంస్థ

- పట్టణ జనాభా 3 లక్షలకు మించి ఉండి, ఆదాయం కోటి రూపాయల కంటే ఎక్కువగా ఉంటే నగర పాలక సంస్థను ఏర్పాటు చేస్తారు. దేశంలో మొదటిసారిగా 1687లో మద్రాస్ నగరానికి కార్పొరేషన్ హోదాను కల్పించారు.
- 1950లో హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల చట్టం ప్రకారం హైదరాబాద్ నగరానికి, సికింద్రాబాద్ నగరానికి ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు.
- 1955లో చట్టం ప్రకారం హైదరాబాద్, సికింద్రాబాద్ కార్పొరేషన్లను ఒకే కార్పొరేషన్‌గా విలీనం చేశారు. అది 1960 నుంచి అమల్లోకి వచ్చింది.

**నగరపాలక సంస్థలో కింది విభాగాలుంటాయి**

1. నగర పాలక మండలి
2. మేయర్, డిప్యూటీ మేయర్
3. కమిషనర్
4. స్థాయీ సంఘాలు

**నగరపాలక మండలి-కార్పొరేటర్లు**

- నగర పాలక సంస్థ చర్చా సంబంధమైన అంగమే నగర పాలక మండలి. ఇందులో కార్పొరేషన్‌లను వార్డుల ప్రాతిపదికపైన, నగర పాలక పరిధిలో రిజిస్టరైన ఓటర్లు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. వీరి పదవీ కాలం ఐదు సంవత్సరాలు.

**హోదా రీత్యా సభ్యులు**

- నగరపాలక పరిధిలోని శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు తమ పదవీ రీత్యా నగర పాలక మండలిలో సభ్యులుగా ఉంటారు.
- నగర పాలక మండలికి మేయర్ అధ్యక్షత వహిస్తాడు. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక పరోక్షంగా జరిగితే ఆ ఎన్నికలో హోదారీత్యా సభ్యులైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఎంపీలు కూడా పాల్గొనవచ్చు.

**మేయర్, డిప్యూటీ మేయర్**

- నగరపాలక సంస్థ ప్రథమ పౌరుడే మేయర్. నగర పాలక సంస్థకు ఇతడు రాజకీయ అధిపతి. ప్రస్తుతం తెలంగాణలో, ఏపీలో మేయర్, డిప్యూటీ మేయర్ పరోక్షంగా ఎన్నికవుతారు. ఎన్నికలు పార్టీ ప్రాతిపదికపైన జరుగుతాయి.
- వీరిని అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించవచ్చు లేదా అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఒక ఆదేశం ద్వారా కూడా తొలగించవచ్చు.

**కమిషనర్**

- నగర పాలక సంస్థ పరిపాలన అధిపతే కమిషనర్. ఇతడు ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన ఉంటాడు. రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది.
- నగర పాలక వ్యవహారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. నగర పాలక సంస్థకు సంబంధించి సిబ్బంది, ఆస్తులు, కార్యకలాపాలపైన పరిపాలనా నియంత్రణ అధికారాన్ని చెలాయిస్తాడు.

**స్థాయీ సంఘాలు**

- స్థాయీ సంఘాలు నగర పాలక సంస్థకు సలహా సంస్థలుగా వ్యవహరిస్తాయి. నగర పాలక సంస్థ దైనందిన కార్యకలాపాలతో స్థాయీ సంఘాలకు ప్రత్యక్ష సంబంధం ఉంటుంది.

## ఆదాయ వనరులు

- ఇవి నగర పాలక సంస్థ వార్షిక బడ్జెట్‌ను పరిశీలిస్తాయి. నగర పాలక సంస్థ సమర్థంగా పని చేసేందుకు విలువైన సలహాలు ఇస్తాయి.
- 12వ షెడ్యూల్‌లో పేర్కొన్న విధులను నిర్వర్తిస్తాయి.
- స్థానిక పన్నులు ముఖ్యంగా ఆస్తి పన్ను, వృత్తి పన్ను, వినోద పన్ను, ప్రకటనల పన్ను ఇతర ఫీజులు, రుసుములు వసూలు చేస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయక గ్రాంట్లు కూడా అందిస్తాయి. మెట్రోపాలిటన్ ప్రణాళికా కమిటీ ప్రకరణ 243ZE
- దీనికి రాజ్యాంగబద్ధత ఉంది. ప్రతి మెట్రోపాలిటన్ ప్రాంతాలకు ఒక మెట్రోపాలిటన్ ప్రణాళికా కమిటీని ఏర్పాటు చేయాలి.
- ఇది మెట్రో పాలిటన్ ప్రాంత సమగ్ర అభివృద్ధికి అవసరమైన ముసాయిదా ప్రణాళికలను రూపొందిస్తుంది.

## నిర్మాణం

- రాష్ట్ర శాసనసభ ఒక చట్టం ప్రకారం దీని నిర్మాణానికి సంబంధించిన అంశాలను రూపొందిస్తుంది.
- ప్రణాళిక కమిటీ మొత్తం సభ్యుల్లో 2/3వ వంతు సభ్యులను, మెట్రో పాలిటన్ ప్రాంత పరిధిలో ఎన్నికైన మున్సిపాలిటీ సభ్యులు అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. ఇందులో మొత్తం 24 మంది సభ్యులు ఉంటారు.
- నగర కార్పొరేషన్ మేయర్ చైర్మన్‌గా, మున్సిపల్ కమిషనర్ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు.
- రాష్ట్ర ప్రభుత్వం నలుగురు సభ్యులను నియమిస్తుంది.
- నగర పరిధిలోని కార్పొరేటర్లు 18 మంది సభ్యులను ఎన్నుకుంటారు.
- ఈ కమిటీ రూపొందించిన అభివృద్ధి ప్రణాళికను మెట్రోపాలిటన్ కమిటీ చైర్మన్ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తాడు.

జీబీకే పబ్లికేషన్స్
హైదరాబాద్, 9959361278